www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 26 నవంబర్ 2025

5

తూర్పుగోదావరి

గృహ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకంలో ఇంటి నిర్మాణానికి సంబంధించి ఈనెల 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఎఇ కె.రాజేష్ మంగళవారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పిఎంఎవై గ్రామీణ్ పథకంలో భాగంగా గృహ నిర్మాణానికి ప్రభుత్వం అందించే హౌసింగ్ స్కీం ఆన్‌లైన్ సర్వే ఈనెల 30లోపు ముగుస్తుందన్నారు. అర్హులైన లబ్ధిదారులందరూ ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. గృహ నిర్మాణ శాఖ ఎఇ కార్యాలయాలు, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీనిపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, ఈ పథకాన్ని వినియోగించుకునేలా చూడాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఎంపిడిఒ జి.రాజామనోహర్ ఆదేశించారు.

జిల్లాల పునర్విభజనతో మారిన స్వరూపం

- 'తూర్పు'లోకి రాయవరం, మండపేట కపిలేశ్వరపురం మండలాలు
- పెద్దాపురం డివిజన్‌లోకి సామర్లకోట
- రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా

ప్రజాశక్తి - కొవ్వూరు

రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనతో మరోసారి జిల్లాల స్వరూపం మారనుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు రకాల మార్పులు చోటు చేసుకోనున్నాయి. జిల్లాల పునర్విభజనపై మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై సిఎం చంద్రబాబు మంగళవారం సచివాలయంలో సమీక్ష చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించిన మార్పులు చేర్పులపైన పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పటి వరకూ కాకినాడ జిల్లా కాకినాడ డివిజన్లో పరిధిలో ఉన్న సామర్లకోటను పెద్దాపురం డివిజన్‌లో విలీనం చేయనున్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలు రాజమహేంద్రవరం డివిజన్‌లో విలీనం చేసేందుకు నిర్ణయించారు. ఇప్పటివరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భాగంగా ఉన్న రంపచోడవరాన్ని నూతన తూర్పుగోదావరి జిల్లాలోకి విలీనం చేసేందుకు తొలిత ప్రతిపాదించారు. 24.48 లక్షల జనాభాతో రాష్ట్రంలో కెల్లా పెద్ద జిల్లాగా మారనున్నడంతో ఆ ప్రతిపాదనను విరమించారు.

పోలవరం జిల్లాకు గ్రీన్ సిగ్నల్

పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత ప్రాంతాలను అభివద్ధి చేయాలన్న లక్ష్యంతో రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాను ఏర్పాటు చేస్తున్నట్లు సిఎం చంద్రబాబు ప్రకటించారు. మంత్రులు అనగాని సత్యప్రసాద్, అనిత నారాయణ జనార్దన్ రెడ్డి, నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో బృందం జిల్లాల పునర్విభజనపై అధ్యయనం చేసింది. కేబినెట్ మంత్రుల ప్రతిపాదనలపై సిఎం చంద్రబాబు సమీక్షించిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా మూడు జిల్లాలను, ఐదు డివిజన్‌లలో ఒక మండల కేంద్రాన్ని కొత్తగా ప్రకటించారు. రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రంపచోడవరం చింతూరు డివిజన్లతో పాటు పోలవరం మండలాన్ని కలుపుతూ కొత్త జిల్లా ఏర్పాటు కానుంది. పోలవరం ముంపు ప్రాంతాలు అభివద్ధి లక్ష్యంగా నూతన జిల్లాను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. రంపచోడవరం డివిజన్‌లో దేవీపట్నం, వై.రామవరం, గుర్తేడు, అడ్డతీగల, గంగవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి మండలాలను చేర్చారు. చింతూరు డివిజన్ పరిధిలో ఎటపాక చింతూరు, కూనవరం వర రామచంద్రపురం మండలాలను చేర్చారు. వైసిపి హయాంలో రంపచోడవరం, చింతూరు డివిజన్లను, పాడేరు, అరకును కలిపి అల్లూరి సీతారామరాజు జిల్లాగా మర్చారు. దీంతో జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. జిల్లా కేంద్రమైన పాడేరు చింతూరుకి 215 కిలోమీటర్ల దూరం ఉండడంతో నానా కష్టాలు పడ్డారు. వీటిని దృష్టిలో పెట్టుకుని రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే పోలవరం ప్రజలు జిల్లా కేంద్రమైన రంపచోడవరం రావాలంటే కొన్ని ఇబ్బందలు తప్పవు. వారు పోలవరం నుంచి రాజమహేంద్రవరం వచ్చి అటు నుంచి రంపచోడవరం వెళ్లాల్సి వుంటుంది. దీనిపై ప్రజల్లో భిన్నభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. నూతన జిల్లాగా ఏర్పాటు చేయడం పట్ల గిరిజనుల్లో హర్షం వ్యక్తమ అవుతుంది.

ఇదిలా ఉండగా తూర్పు గోదావరి జిల్లాలో విలీనమైన గోపాలపురం మండలాన్ని ఏలూరు జిల్లాలో విలీనం చేస్తారని తొలుత వార్తలు వచ్చాయి. కాని సమీక్షలో దీనిపై ఎలాంటి ప్రకటన రాలేదు. అలాగే రామచంద్రపురం మండలాన్ని కాకినాడలో విలీనం చేయాలనే డిమాండ్ బలంగా ఉంది. కాని దీనిపైనా ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించలేదు. దీంతో రామచంద్రపురం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనే కొనసాగనుంది. మార్పులు, చేర్పులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేసేందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు చేపట్టింది.

పెద్దాపురం డివిజన్‌లోకి చేరనున్న సామర్లకోట పట్టణం



రైతు సేవా కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

రైతుల ఖాతాల్లో రూ.1674 కోట్ల జమ

పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - రాజానగరం

రైతులకు చెల్లించాల్సిన రూ.1674 కోట్లు, రైస్ మిల్లర్లకు బకాయి పెట్టిన రూ.1100 కోట్లలో. రూ.470 కోట్లను ప్రభుత్వం చెల్లించిందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సంపత్‌నగరం రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ, జెసి వై.మేఘా స్వరూప్‌లతో కలిసి ఆయన మంగళవారం సందర్శించారు. రైతులు, సిబ్బందితో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాజానగరం నియోజకవర్గంలో 1.24 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 89 వేల మంది రైతుల నుంచి 1.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రూ.430 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. డిసెంబర్ 31 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఖరీఫ్ ధాన్యం కొనుగోలు పూర్తవు తుందన్నారు. ఎంఎల్ఎ బత్తుల మాట్లాడుతూ పభుత్వం రైతులకు ప్రాధాన్యం ఇస్తూ ఆదర్శవంతమైన పరిపాలన అందిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ, ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్, డిఎస్ఒ వి.పార్వతి, డిఎంసిఎస్ బి.గణేష్‌కుమార్, డిసిఒ ఎం.వెంకటరమణ, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబి, సివిల్ సప్లయీస్ చైర్మన్ తోట సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రాజవోలులో ధాన్యంపై ఆరా తీస్తున్న మంత్రి నాదెండ్ల

రాజవోలులో మంత్రి మనోహర్ పర్యటన

రాజమహేంద్రవరం రూరల్ : రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం రాజవోలు గ్రామాన్ని సందర్శించారు. మంత్రి వెంట రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకష్ణ, ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు. గ్రామంలోని పంట పొలాలన సందర్శించి కోతల పురోగతిని పరిశీలించారు. పంట కోతల కోసం ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన రైతు కూలీలతో మంత్రి మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 28 తర్వాత వాతావరణంలో మార్పులు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు వేగంగా కోతలు పూర్తి చేసుకోవాలన్నారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. రైతు ప్రయోజనాలే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం అని ఆయన పేర్కొన్నారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వంతల రాంబాబు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు రూ.3వేలు భృతిగా ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. ఈ హామీతో నిరుద్యోగులు కూటమికి పట్టం గట్టారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర పైబడినా నేటికీ ఈ హామీని అమలు చేయలేదన్నారు. నిరుద్యోగులు ఉద్యోగాల కోసం కోచింగ్ సెంటర్లకు రూ.వేల కట్టుకుంటూ తల్లిదండ్రులకు భారం కాలేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అటువంటి యువతకు ప్రభుత్వం ఇచ్చే నిరుద్యోగ భృతి చాలా వరకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో అన్ని అమలు చేశామని చెబుతున్నారని, నిరుద్యోగ భృతి సంగతి ఏంటని ప్రశ్నించారు. ఉద్యోగాలు లేక, భృతి లేక నిరుద్యోగులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం ఈ హామీని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.లేకుంటే నిరుద్యోగుల పక్షాన భవిష్యత్‌లో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టి.రాజేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు చాగల్లు విద్యార్థులు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు జడ్‌పిహెచ్ఎస్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. గత నెల తణుకులోని మహిళా కళాశాలలో జరిగిన అండర్-19 జిల్లా స్థాయి యోగా ఎంపిక పోటీల్లో వీరు పాల్గొన్నారు. పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 25, 26 తేదీలలో చీరాలలో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగనున్నాయని పీడీ జె.విజయలక్ష్మి తెలిపారు. ఎస్.ప్రసన్న, కె.సుప్రజ, ఎస్.హేమ, కె.మనోజ్, శరణ్య, ఎం.మెర్సి, కె.బాలసుబ్రహ్మణ్యం, కె.జగదీష్, డి.ధనరాజ్ పోటీకు ఎంపికైన వారిలో ఉన్నారు. విద్యార్థులను హెచ్ఎం వి.వాసవి, పీడీ జె.విజయలక్ష్మి, పోసి రత్నం, చంద్ర, సుధాకర్, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులకు అవగాహన

చాగల్లు : మండలంలోని బ్రాహ్మణగూడెం జడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు రక్షణ చట్టాలు, గుడ్, బ్యాడ్ టచ్‌లపై పోలీసులు మంగళవారం అవగాహన కల్పించారు. చాగల్లు ఎస్ఐ కె.నరేంద్ర, కొవ్వూరు సబ్ డివిజన్ శక్తి టీం సిబ్బంది, ఎఎస్ఐ గంగాధర్‌రావు, మహిళా సిబ్బంది ఎస్‌వి.భవాని, ఎం.పద్మావతి ఎం.వరలక్ష్మి పలు అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, మహిళల పట్ల లైంగిక వేధింపులు, మహిళా రక్షణ చట్టాల గురించి వివరించారు. అత్యవసర సమయంలో ఉపయోగించుకునే 112 కాల్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం టి.విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

నగరంలో జరిగే నిర్మాణాలకు నగర పాలక సంస్థ నుంచి అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని కమిషనర్ రాహుల్ మీనా స్పష్టం చేశారు. మంగళవారం సీతంపేట, గాదాలమ్మనగర్ పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. స్థానికంగా నిర్మిస్తున్న నూతన భవనాలకు సంబంధించిన పట్టణ ప్రణాళిక విభాగం జారీ చేసిన అనుమతులను తనిఖీ చేశారు. వివిధ భవనాలకు సంబంధించి అసెస్మెంట్ డిమాండ్లతో భవనాల కొలతలను పరిశీలించారు. బహుళ అంతస్తు భవనాలు నిర్దేశిత ప్లాన్ ప్రకారం నిర్మిస్తేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేస్తామని తెలిపారు. అనంతరం టౌన్ ప్లానింగ్ సిబ్బందితో మాట్లాడారు. ప్లాన్‌కి విరుద్ధంగా నిర్మాణం జరిగే వాటికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

29, 30 తేదీల్లో గోదావరి బాలోత్సవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

రాజమహేంద్రవరంలోని ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాలలో గోదావరి బాలోత్సవం 3వ పిల్లల పండుగ కార్యక్రమాన్ని ఈనెల 29, 30 తేదీల్లో ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తులసి, అసోసియేట్ అధ్యక్షులు వివిఎస్ఎస్.కృష్ణకుమార్ వెల్లడించారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు ఈ వివరాలను వెల్లడించారు. 29వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ బాలోత్సవాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ముఖ్య అతిథులుగా టీచర్స్ ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి, కలెక్టర్ కీర్తి చేకూరి, జెసి వై.మేఘాస్వరూప్, గౌరవ అతిథులుగా డిఇఒ కె.వాసుదేవవరావు, నున్న తిరుమలరావు, పంతం కొండలరావు తదితరులు హాజరవుతారన్నారు. జిల్లా వ్యాప్తంగా 150 పాఠశాలల నుంచి 6 వేల మంది ఇప్పటికే రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని తెలిపారు. అకడమిక్, కల్చరల్ విభాగాల్లో మొత్తం 71 పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో విజేతలకు 30వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ముగింపు సభలో బహుమతులు అందిస్తామన్నారు. తల్లితండ్రులు, విద్యా సంస్థల యాజమాన్యాలు తమ పిల్లలని తీసుకొని బాలోత్సవానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేసుకోని వారెవరైనా ఉంటే కార్యక్రమం జరిగే రోజు ఉదయం 8 గంటలకు వచ్చి స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా చేయించుకోవచ్చు అని తెలియజేవారు. రెండు రోజులు కూడా బాలోత్సవంలో పాల్గొనేవారంతా ఉదయం 8 గంటలకే వేదిక వద్దకు చేరుకోవాలని, సాయంత్రం 4గంటలకు కార్యక్రమం పూర్తయ్యేవరకు ఉండాలని, రెండ్రోజులు జరిగే ఈ బాలోత్సవాలను జయప్రదం చేయాలనీ నిర్వాహకులు కోరారు. ఈ సమావేశంలో బాలోత్సవం కార్యదర్శి పువ్వుల ఆనంద్, ఉపాధ్యక్షులు నవీనకుమారి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

RAJAHMUNDRY

వివరాలను వెల్లడిస్తున్న ఆర్గనైజింగ్ సెక్రటరీ తులసి

కలెక్టర్‌నూ లెక్కచేయని గైట్ యాజమాన్యం

- ఫీజుల కోసం విద్యార్థులపై తీవ్ర వత్తిడి
- గైట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

గోదావరి గ్లోబల్ యూనివవర్సిటీ యాజమాన్యం కలెక్టర్ మాటను సైతం లెక్క చేయట్లేదని, ఫీజుల కోసం విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి తెస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్, కార్యదర్శి ఎన్.రాజా విమర్శించారు. ఫీజుల విషయంలో కలెక్టర్ సమక్షంలో చర్చలు జరిగాయన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులను ఇబ్బందులు పెట్టరాదని ఆ సమయంలో కలెక్టర్ గైట్ యాజమాన్యాన్ని ఆదేశించారన్నారు. అయినా యాజమాన్యం తన తీరును మార్చుకోలేదన్నారు. సెమిస్టర్ ఫీజు కట్టేందుకు సోమవారంతో గడువు ముగిసిందన్నారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.10వేలు కట్టాలంటూ విద్యార్థులను ఒత్తిడికి గురిచేసి కటించుకున్నారన్నారు. అంతేకాకుండా లేటు ఫీజుగా నిన్నటి వరకు మరో రూ.300 అదనంగా వసూలు చేశారన్నారు. బుధవారం నుంచి లేటు ఫీజు రూ.600 చెల్లించాలని యాజమాన్యం హుకుం జారీ చేసిందన్నారు. సెమిస్టర్ ఫీజులు తక్షణమే కట్టించుకోవాలని, అందుకు లింక్ ఓపెన్ చేయించాలని డిమాండ్ చేశారు. ఏ ఒక్క విద్యార్థి పరీక్ష రాయకున్నా దానికి జిజియు యాజమాన్యమే భాధ్యత వహించాలన్నారు. కళాశాలను పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా భాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థులకు తగిన న్యాయం చేయాలని కోరారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - గోపాలపురం

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే రోగాలను నివారించొచ్చని సర్పంచ్ జొన్నకూటి మణమ్మ, పంచాయతీ కార్యదర్శి ఎస్.చిన్నవెంకయ్యమ్మ తెలిపారు. మంగళవారం వాదాలకుంట సచివాలయం వద్ద పంచాయతీ పరిధిలో చెత్త సేకరణ చేసేందుకు ఏర్పాటు చేసిన గ్రీన్ వెహికల్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. పంచాయతీ పరిధిలో చెత్త సేకరణ చేసేందుకు ఒక వాహనం మాత్రమే ఉండడంతో ఇబ్బందులు తలెత్తేవన్నారు. దీంతో మరొక వాహనం కొనుగోలు చేశామన్నారు. ప్రజలు పొడి, తడి చెత్త వేరుచేసి పంచాయతీ వాహనాలకు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఉండవల్లి సోమశేఖర్, జొన్నకూటి మోహన్, ప్రత్తిపాటి రాంబాబు, సాధనాల ఆనందరావు, కాకర్ల సతీష్, ప్రత్తిపాటి వెంకటేష్, కె.సూర్యచంద్ర, ప్రత్తిపాటి సమాధానం, పంచాయతీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌బాల్‌లో వాదాలకుంట విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -గోపాలపురం

రాష్ట్ర స్థాయి అండర్-14 ఫుట్‌బాల పోటీల్లో వాదాలకుంట హై స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి మెడల్స్ అందుకున్నారని హెచ్ఎం పి.విజయకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా మదనపల్లిలో ఈ నెల 19 నుంచి 21 వరకూ ఈ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీలో బాలుర విభాగంలో తమ పాఠశాల 9వ తరగతి విద్యార్థి మహీధర్, బాలికల విభాగంలో అక్షర ప్రతిభ కనబర్చి మెడల్స్ గెలుచుకున్నారన్నారు. విద్యార్థులను, పీడీ ఫణిలను మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోని జడ్‌పి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నందిగం శ్రీనివాసరావు ఆవిష్కరించారు. విగ్రహం దాత హైదరాబద్‌కు చెందిన మహిత గ్రూప్ అధినేత కాగిత సురేష్‌కుమార్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సొసైటీ అధ్యక్షులు బొల్లిన నాగేంద్ర, ఎంపిపి మట్టా వీరస్వామి, ఎస్ఎంసి చైర్మన్ కామన శివ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు, గ్రామస్తులకు కాగిత సురేష్‌కుమార్ విందు ఏర్పాటు చేశారని హెచ్ఎం ఎన్‌వి.రమణ తెలిపారు.

వెంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలకవర్గం, నాయకులు

వెంకన్న ఆలయ నూతన చైర్మన్‌గా కోటేశ్వరరావు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం చైర్మన్‌గా నీలి కోటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ కోటేశ్వరరావు మాట్లాడుతూ సేవే ధ్యేయంగా పని చేస్తానన్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. యాత్రికులకు మెరుగైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటానన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరికి ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. తనకు సహకరించిన కూటమి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ డైరెక్టర్లగా బాధ్యతలు చేపట్టిన వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పండూరి అప్పారావు, తలారి మూర్తి, జనసేన నాయకులు యడ్ల మహేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కొవ్వూరు

రైతు శ్రేయస్సే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని నందమూరు గ్రామంలో మంగళవారం రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. అన్న దాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలపై ఇంటింటా ప్రచారంలో ఎంఎల్ఎ పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ద్వారా రైతుకు చేకూరుతున్న ప్రయోజనాలు, పథకాలు అర్హతలు గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అర్హులైన రైతుకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ లబ్ధి అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంటిపూడి శ్రీనివాసరావు, కొడవటి అనిల్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెరవలి : మండలంలో పలు గ్రామాల్లో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి నాయకులు బూరుగుపలి రాజు, అధికారులు పాల్గొన్నారు. కానూరులో రైతుల వద్దకు వెళ్లి కరపత్రాలు పంచారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రానున్న కాలంలో రైతులకు అందించే పథకాలపై అవగహన కల్పించారు.

కార్టూ'నిజం'



రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు...చెబితే అలా నవ్వుతాడేమిటి...?
శేఖర్.

కొత్తపల్లి పిహెచ్‌సిలో కన్వర్జెన్సీ మీటింగ్

ప్రజాశక్తి-గోకవరం

కొత్తపల్లి పిహెచ్‌సిలో వైద్యాధికారి డాక్టర్ నిఖిత ఆధ్వర్యంలో కన్వర్జెన్సీ మీటింగ్ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నిఖిత మాట్లాడుతూ అంగన్‌వాడీలు, ఎఎన్ఎంలు, ఆశాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి నెలా విహెచ్ఎన్‌డి కార్యక్రమంలో స్థానిక నాయకులను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. ఫీల్డ్ లెవెల్‌లో గర్భిణులను నమోదుపై అందరూ రిజిస్టర్లను నిర్వహించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలను సక్రమంగా వేయాలన్నారు. డిసెంబర్ 21, 22, 23 తేదీల్లో జరిగే పల్స్ పోలియోను విజయవంతం చేయాలన్నారు. తీవ్ర పోషకాహార లోపంతో ఉన్న పిల్లలకు అంగన్వాడీ సెంటర్స్ లో అనుబంధ ఆహారం ఇవ్వాలన్నారు. వైద్యాధి కారులు సెంటర్స్ సందర్శించి సమయంలో ఈ పిల్లలను గుర్తించి తగిన వైద్యం అందేలా చూడాలన్నారు. సచివాలయ సిబ్బంది పోక్సో చట్టపై అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఎల్.రజని మాట్లాడుతు అంగన్‌వాడీ కేంద్రాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో హెచ్ఎస్ బి.రాజేశ్వరి, ఎంపిహెచ్ ఎ.పవన్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లి పిహెచ్‌సిలో మాట్లాడుతున్న వైద్యాధికారి నిఖిత

పెరవలి : పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రాజనాలప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడీలతో కన్వర్జెన్సీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మంగళవారం కన్వర్జెన్సీ సమావేశం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ సూపర్‌వైజర్ హసీనా, అంగన్‌వాడీలు, హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి-నల్లజర్ల

గ్రామాల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపిపి బంక జయలక్ష్మి కోరారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ సిహెచ్.సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం జరిగింది. వివిధ శాఖలకు సంబంధించి మండలంలో చేపట్టిన పనులను అధికారులు వివరించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, పచ్చదనంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తహశీల్దార్ పి.కృష్ణారావు మాట్లాడుతూ రెవెన్యూ పరంగా మండలంలో తెలికిచెర్ల గ్రామంలో ఫ్రీ సర్వే పనులు జరుగుతున్నాయన్నారు. రెవెన్యూ సమస్యలు ఏమైనా ఉంటే తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. డిప్యూటీ ఎంపిడిఒ ఎం.సింహాద్రిరావు మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో ప్రతిరోజు ఉదయం పరిశుభ్రతపై దృష్టి పెట్టామన్నారు. తొలుత అనారోగ్యంతో మృతి చెందిన అనంతపల్లి పంచాయతీ కార్యదర్శి శ్రీదేవికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లజర్ల సొసైటీ చైర్మన్ రావూరి వెంకటరమణ, ఎఒ బి.సోమశేఖర్, ఎంఇఒ సత్యనారాయణ, ఎపిఎం శ్యాంసుందర్, పంచాయతీ రాజ్ ఎఇ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ, డిటి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - యానాం

పిల్లంక నుంచి యానాం నల్లచెరువుకు వచ్చే మంచినీటి కాలువలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమయిందని స్టేషన్ ఇన్‌ఛార్జ్, ఎఎస్‌ఐ అరదాడి పోచయ్య తెలిపారు. మృతిని వ్యక్తి వయస్సు 50 సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చిలో భద్రపరిచామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఒకే రోజు రెండు బైకుల చోరీ

ప్రజాశక్తి- గోపాలపురం

గోపాలపురంలో బ్యాంకు ఆఫ్ బరోడాను ఆనుకుని ఉన్న రజకులపేటలో ఒకే రోజు రెండు బైకులు చోరీకి గురయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. తుట్ట అంజిబాబు టిఫిన్ సెంటర్ పెట్టుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం రాత్రి రజకులపేటలో తన ఇంటి వద్ద సీడీ డీలక్స్ బైకును పార్క్‌చేశాడు. తెల్లవారు జామున చూసేసరికి బైకు అదృశ్యమైంది. అలాగే బ్యాంక్ ఆఫ్ బరోడా పక్కన ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్న మేక దుర్గారావు తన ద్విచక్ర వాహనాన్ని ఆదివారం అర్ధరాత్రి పక్క వీధిలో పెట్టాడు. తెల్లవారుజామున లేచి చూసేసరికి తన ద్విచక్ర అదృశ్యమైంది. గతేడాది డిసెంబర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు తన బైకును దొంగిలించారని దుర్గారావు తెలిపాడు. ఆరు నెలల క్రితం తెలిసిన వారి నుంచి స్కూటీని తెచ్చుకుని వాడుతున్నానని తెలిపారు. ఇప్పుడు దీన్ని కూడా దొంగిలించారని వాపోయాడు. గోపాలపురం పరిధిలో ఇంతకుముందు కూడా పలువురు బైకులు చోరీకి గురైనట్లు తెలిపారు. ఈ చోరీలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

సమీక్షిస్తున్న డాక్టర్ వసుంధర

కుష్టు నిర్మూనకు ఎల్‌సిడిసి సర్వే

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

భారత ప్రభుత్వం కుష్టు వ్యాధి నిర్మూలన కోసం ఎల్‌సిడిసి సర్వే నిర్వహిస్తుందని, నవంబర్ 17న ప్రారంభమైన ఈ క్యాంపెయిన్ డిసెంబర్ 2 వరకు కొనసాగుతుందని జిల్లా కుష్టు వ్యాధి, క్షయ వైద్యాధికారి డాక్టర్ వసుంధర తెలిపారు. డాక్టర్ హరికతో కలిసి రాజమహేంద్రవరంలోని అంబేద్కర్‌నగర్ యుపిహెచ్‌సిను ఆమె మంగళవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పర్యటించారు. చేసి కుష్టు, క్షయ వ్యాధులపై అవగాహన కల్పించారు. చర్మంపై తేలికపాటి లేదా ముదురు రంగు మచ్చలు ఉంటే వెంటనే స్థానిక ఆసుపత్రిలో చూపించుకోవాలన్నారు. మచ్చలు ఉన్న చోట స్పర్శ కోల్పోవడం, కండరాల బలహీనత, నరాలు దెబ్బతినడం వల్ల చేతులు, కాళ్లు లేదా ముఖంలో వైకల్యాలు ఏర్పడటం ఈ వ్యాధి లక్షణాలని తెలిపారు. వారి వెంట యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కె.సునీల్, హెల్త్ సూపర్‌వైజర్ ఎ.వీర్రాజు ఉన్నారు.

స్వమిత్వ గ్రామసభల నిర్వహణ

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలో స్వమిత్వ గ్రామసభలను నిర్వహిస్తున్నారు. మంగళవారం ఎస్.ముప్పవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ముప్పిడి మహాలక్ష్ముడు అధ్యక్షతన నిర్వహించిన సభలో డిప్యూటీ ఎంపిడిఒ ఆర్.శ్రవణ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ప్రజల సమక్షంలో వెరిఫికేషన్ నిమిత్తం ఈ సభను నిర్వహిస్తున్నామన్నారు. గృహ యజమానులు వారి సరిహద్దులు సరిపోల్చుకోవాలన్నారు. ఫారం టు ద్వారా అంగీకారం ఇవ్వాలని, కొలతల్లో ఏవైనా తేడాలుంటే ఫారం3 ద్వారా అభ్యంతరాలు తెలియజేయొచ్చన్నారు. పంచాయతీ కార్యదర్శి, విఆర్ఒ, విలేజ్ సర్వేయర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో మరోసారి రికార్డుల ఆధారంగా వీటిని పరిశీలించి చేస్తారని తెలిపారు. సర్వే చేసిన యజమానుల పేర్లు, కొలతలు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ రామ తులసి చదివి వినిపించారు. పలువురు గ్రామస్తులు అడిగినటువంటి ప్రశ్నలకు మండల అధికారులు సమాధానాలిచ్చారు. మండల సర్వేయర్ శేషు, విలేజ్ సర్వేయర్ నాగసాయి, మాజీ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మహిళా చట్టాలపై పాలంగిలో మహిళలకు మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించామని పారాలీగల్ వాలంటీర్ కాకర్ల నరసన్ననాని తెలిపారు.సమాజంలో మహిళలపై జరుగుతున్న అత్యాచార, గృహహింస, మానసిక వేధింపులకు గురవుతున్న మహిళా మణులకు సంబంధించిన మహిళా కమిషన్, గృహహింస నుండి మహిళల రక్షణ చట్టంపై అవగాహన కల్పించామన్నారు. మనోవర్తి, డైవర్స్ చట్టాలపై ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ, జిల్లా, తణుకు మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ జిల్లా అడిషనల్ జడ్జి ఆదేశానుసారం, అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

వజ్రోత్సవ వేడుకలకు ఎంఎల్ఎ నల్లమిల్లికి ఆహ్వానం

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

నిడదవోలు పురపాలక సంఘం వజ్రోత్సవ వేడుకలకు అనపర్తి ఎంఎల్ఎ నల్లమల్లి రామకృష్ణారెడ్డిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నిడదవోలు పట్టణ అధ్యక్షులు రంగా రమేష్, పట్టణ కార్యదర్శి బి.నాగేంద్ర, బిజెపి టౌన్ అధ్యక్షులు మోర్త ప్రమోద్, నాయకులు బైపే ప్రసాద్, జనసేన కార్యకర్తలు షేక్ హైదర్ భాషా, ఉల్లి నాగేశ్వరావు పాల్గొన్నారు.

నల్లమిల్లికి ఆహ్వానపత్రం అందిస్తున్న నాయకులు

శిథిలావస్థలో ఆరోగ్య ఉప కేంద్రాలు


కూలేందుకు సిద్ధంగా ఉన్న గోడ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గ్రామాల్లో పేదలకు వైద్య సేవలందించేందుకు ఏర్పాటుచేసిన ఆరోగ్య ఉప కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వైద్యం కోసం వచ్చే రోగులతో పాటూ వైద్య సిబ్బందిని భయభ్రాంతులకు గురి చేసేలా తయారయ్యాయి. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్, ఆనంద ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు మాత్రమే గోడలపై కనిపిస్తున్నాయి. 14 ఏళ్ల క్రితం 2011లో నిర్మించిన చివటం, పాలంగి, సత్యవాడ గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాలు నేడు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఫ్లోరింగ్, సీలింగ్ బీటలు వారాయి. గోడలు సైతం పడిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. సిబ్బంది నివసించే క్వార్టర్ సైతం ప్రమాదకరంగా తయారైంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రోగులు, సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు


కుంగిన ఫ్లోరిర్


చివటం ఉపకేంద్రంలో కుంగిన ఫ్లోరింగ్


పాలంగి ఉపకేంద్రలో బాత్రూమ్ ఇలా..

పండుగలు, జాతరలతోనే జీవనం

ఆట వస్తువులు అమ్ముకుంటూ పోషణ
ఐదు తరాలుగా ఇదే వ్యాపారంలో అనకాపల్లికి చెందిన ఇబ్రహీం, ఖాదర్ వలీల కుటుంబాలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పండుగలు, జాతరలు, ఇతర ఉత్సవాలతోనే వారి జీవనం ముడి పడి ఉంది. జాతరలు, తీర్థాల్లో ఆట వస్తువులు అమ్ముకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు అనకాపల్లికి చెందిన షేక్ ఇబ్రహీం, ఖాదర్ వల్లీల కుటుంబాలు. ఉండ్రాజవరంలో సుబ్రహ్మణ్య షష్టి ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మండలంలోని 15 గ్రామాల ప్రజలతో పాటు తణుకు, పెరవలి, కానూరు వంటి ప్రాంతాల నుంచి యాత్రికులు షష్టి రోజున ఇక్కడ సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకుంటారు. మూడు రోజులపాటు ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తారు. దేవాలయం పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే అనేక రకాల ఆట వస్తువులు, తినుబండారాలు దుకాణాలు ఏర్పాటు చేశారు. దుకాణాలతో పాటు రంగులరాట్నం వంటి వినోదాన్ని అందించే అనేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల సందర్భంగా అనకాపల్లికి చెందిన షేక్ ఇబ్రహీం, ఖాదర్ వల్లీల కుటుంబాలు ఇక్కడ ఆటవస్తువులను అమ్ముకునేందుకు వచ్చాయి. సుమారు 20 మంది సభ్యులు ఈ దుకాణాల ఏర్పాట్లలో తలమునకలయ్యారు. నాలుగైదు తరాలుగా ఉండ్రాజవరంలో ఆట వస్తువులు అమ్ముకునేందుకు తాము ఇక్కడికి వస్తున్నామని వారు తెలిపారు. తమ కుటుంబ సభ్యులు మొత్తం రాష్ట్రంలో ఘనంగా నిర్వహించే శివరాత్రి, షష్టి, జాతరలు, వంటి ఉత్సవాలకు రోడ్ల పక్కన దుకాణాలు ఏర్పాటు చేసుకొని జీవనం కొనసాగిస్తామని వారు తెలిపారు. ఇటీవల కాలంలో తమ దుకాణాలకు ఆదరణ తగ్గిందని, దాంతో ఆదాయం లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వంశపారంపర్యంగా ఇదే వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు.

ఆటవస్తువుల దుకాణాలు

రంగులరాట్నం

కొనుగోళ్లపై విమర్శించే హక్కులేదు

మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - బిక్కవోలు

ధాన్యం కొనుగోళ్ల విషయంలో కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు ఎవరికీ లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి బలబద్రపురం గ్రామంలో 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. నల్లమిల్లి మూలారెడ్డితో తన తండ్రికి ఎంతో అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. తపనతో పని చేసే నాయకుడు రామకృష్ణారెడ్డి అని అన్నారు. గత ప్రభుత్వ చేతకాని పాలనతో రైతులు నానా ఇబ్బందులకు గురయ్యారన్నారు. కూటమిలో రైతులకు పలు పథకాలను అమలు చేస్తున్నామన్నారు. పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్ల కోసం సంస్కరణలు తెచ్చామన్నారు. అనపర్తి నియోజకవర్గంలో 93 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందన్నారు. ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామన్నారు. గతేడాది 34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తే ఈ ఏడాది 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. టార్పాలిన్‌లను కూడా త్వరలో ఉచితంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లల ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై వైద్యారోగ్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడి సిబ్బందికి అవగాహన కార్యక్రమం మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలోని సమావేశమందిరంలో నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎవికె.చైతన్య మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లలోని ప్రతి బిడ్డను వైద్యాధికారి సమగ్రంగా పరీక్షిస్తారనానరు. వయస్సుకు తగ్గా ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ స్థాయి, ఇతర అనారోగ్య సమస్యలను పరిశీలిస్తారన్నారు. అవసరమైన పిల్లలకు తగిన వైద్యం అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ భారతి, ఎంపిఇహెచ్‌ఇఒ వైఎస్.రాయుడు, పిహెచ్‌ఎస్ కె.ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్ కె.సుధాకర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కె.పెద్దలక్ష్మి, సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సాగులో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుకోవాలి

ప్రజాశక్తి-కడియం

వరి వంగడాలు అందిస్తున్న ఎంఎల్ఎ బుచ్చయ్య

వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుకుని నాణ్యమైన, అధిక దిగుబడులు పొందాలని తూర్పు గోదావరి జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ రైతులకు సూచించారు. మంగళవారం కడియం, మాధవరాయిడు పాలెం గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, వ్యవసాయ సాంకేతికత వంటి విషయాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన కొత్త వరి, మొక్కజొన్న, మినుము, పెసర, నువ్వులు రకాలను వినియోగించు కోవాలనీ రైతులను కోరారు. అనంతరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు మార్టేరు పరిశోధన స్థానం నుంచి అభివృద్ధి చేసిన వరి చిరుసంచి రకం ఎంటియు 1426ను రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి చేతులు మీదుగా రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, సొసైటీ చైర్మన్ వెలుగుబంటినాని, ఎడిఎ ఎస్.జయరామలక్ష్మి, ఎఒ పివి.శ్రీనివాస్, అభ్యుదయ రైతులు అన్నందేవుల చంటి, కొండరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని తిరుమలాయపాలెంలో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ మంగళవారం ప్రారంభించారు. సర్పంచ్ పురంశెట్టి శివాజీ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు సకాలంలో అందించాలనే ఉద్దేశ్యంతో దీన్ని ఏర్పాటు చేశామనానరు. కొత్తపల్లి పిహెచ్‌సికి అనుసంధానంగా ఈ వెల్‌నెస్ సెంటర్లు పనిచేస్తాయన్నారు. గ్రామంలో సాగునీటి కష్టాలు తీర్చేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు. అనంతరం తిరుమలాయపాలెం ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పలు వసతులు కల్పించాలని విద్యార్థులు ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ అడపా భరత్‌కుమార్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వివిఎస్.అప్పలరాజు, సూరంపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ ఉంగరాల రాము, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తా కొండబాబు, మండల అధ్యక్షులు పిల్లా అర్జునసారథి, క్లస్టర్ ఇన్‌ఛార్జి కన్నబాబు, మండల ప్రధాన కార్యదర్శి గునిపే భరత్, ఉండమట్ల దొరబాబు, కోడూరి సత్యనారాయణ, వాకాడ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ నెహ్రూ

మున్సిపల్ హైస్కూల్లో మాక్ పార్లమెంట్

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులు మాక్ పార్లమెంటు నిర్వహించారు. ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టసభల విశిష్టత, వాటి పనితీరు, రాజకీయాలు, రాష్ట్ర అభివృద్ధి, సామాజిక అభ్యున్నతిపై బాలలకు విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాలలకు కేవలం పుస్తకాల్లో అంశాలు మాత్రమే కాకుండా చట్ట సభలు, వాటి పని తీరు, సామాజిక అభ్యున్నతి, మారుతున్న టెక్నాలజీ, రాజకీయాలు, ప్రభుత్వ వ్యవస్థల పనితీరు, రాష్ట్ర అభివృద్ధి వంటి అంశాలపై సైతం వారికి అవగాహన కలిగి ఉండాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. చట్టసభల గొప్పతనం, వాటి పనితీరుపై అవగాహన కల్పించేందుకు విద్యా శాఖ మంత్రి లోకేష్ ఈ కార్యక్రమాలను రూపొందించారన్నారు. ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలో మాక్ అసెంబ్లీ నిర్వహించేందుకు చేపట్టిన చర్యలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, నాయకులు సూర్యదేవర రంజిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాక్ పార్లమెంట్‌లో విద్యార్థులతో కలిసి పాల్గొన్న ఎంఎల్ఎ వెంకటేశ్వరరావు

వృద్ధాశ్రమంలో దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలంలో గొల్లగూడెంలో భారతి దివ్యాంగుల, వృద్ధాశ్రమంలోని వృద్ధులకు, వికలాంగులకు యర్నగూడెం గ్రామానికి చెందిన నరహరిశెట్టి గాంధీ 30 దుప్పట్లను అందించారు. చలికాలం దృష్ట్యా దుప్పట్లను పంపిణీ చేయడం పట్ల ఆశ్రమ నిర్వాహకులు కాగిత భాస్కరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్టా జగన్మోహనరావు, ధూళిపూడి రవీంద్ర, కొటికలపూడి సతీష్ తదితరులు పాల్గొన్నారు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని, ట్రిపుల్ రైడింగ్ చేస్తే జరిమానా తప్పదని ఎస్ఐ డి.రవికుమార్ వాహనదారులను హెచ్చరించారు. మంగళవారం ఉండ్రాజవరం, పాలంగి ప్రధాన రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారులకు హెల్మెట్ ఉపయోగం, తదితరాలపై అవగాహన కల్పించారు. ట్రిబుల్ రైడింగ్ చేస్తున్న పలువురుకి జరిమానా విధించారు. ఆయన వెంట పిసి జి.వెంకటేశ్వర్లు ఉన్నారు.

కార్పొరేట్లకు ప్రభుత్వాలు దాసోహం

ప్రజాశక్తి - కాకినాడ

కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు పని చేస్తున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య విమర్శంచారు. మంగళవారం సిపిఐ జిల్లా మహాసభల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ అడవులు, గనులు ఇతర సహజ సంపదను కార్పొరేట్లకు అప్పగిస్తుందని విమర్శంచారు. అటవీ సంపదను పరిరక్షిస్తున్న ఆదివాసీల్లో 1600 మందిని కేంద్ర ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని ఆరోపించారు. శాంతి చర్చలకు తాము సిద్ధమని ప్రకటించిన మావోయిస్టులను పట్టుకుని కాల్చి చంపడం దారుణమన్నారు. తక్షణమే బూటకపు ఎన్‌కౌంటర్లకు స్వస్తి పలికి కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కుల గణన నిర్వహించాలని, తద్వారా స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను మోడీ ప్రభుత్వం రద్దుచేయాలని డిమాం డ్ చేశారు. విశాఖలో పారిశ్రామిక సదస్సు నిర్వహించి రాష్ట్రానికి రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కడప స్టీల్ ప్లాంట్, రామాయపట్నం పోర్టు, దొనకొండ పారిశ్రామిక వాడ, కాకినాడ సెజ్‌లు ఏమయ్యాయో రాష్ట్ర ప్రజలకు తెలియ చేయాలని హితవు పలికారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేది కాంగ్రెస్ పార్టీయే

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

దేశంలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడి, అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే నని కాంగ్రెస్ పరిశీలకురాలు అంబా ప్రసాద్ స్పష్టం అన్నారు. మంగళవారం నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పార్టీని బలోపేతం చేసేందుకు అధిష్టానం నిర్ణయించిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు డిసిసి అధ్యక్షుల ఎన్నికలు జరుగుతాయని, ఇందుకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు. డిసిసి అధ్యక్షుల ఎన్నికల ద్వారా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ఆలిండియా కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుందన్నారు. పార్టీ కోసం పని చేసేవారికి ప్రాధన్యత ఇస్తాన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ చైతన్యం నింపాలని పిలుపు నిచ్చారు. కార్యర్తల్లో నాయకత్వ, పోరాట స్ఫూర్తిని పెంపొందించడమే ప్రధనా లక్ష్యమన్నారు.ఈ మీడియా సమావేశంలో మాజీ ఎంపి జివి.హర్షకుమార్, పిసిసి పరిశీలకులు రాజీవ్‌రతన్,బాబ్జి, ఎఐసిసి సభ్యురాలు అమర్ జహా బేగ్, పిసిసి ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, ప్రచార కమిటీ ఛైర్మన్ డాక్టర్ వడయార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టికె.విశ్వేశ్వరరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు బాలేపల్లి మురళీధర్, జేటి రామారావు, మేడవరపు భద్రం దొర, ఎస్ఎకె హర్షద్, ఎం.శారద పాల్గొన్నారు.

మహారాజశ్రీ యలమంచిలి ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి
(జూనియర్ డివిజన్) వారి కోర్టులో
IA 651/2023 OS 313/2023

పిటిషనర్లు/వాదులు :
తుమ్మల సూర్య ప్రసాద్ మరి 1రు
రెస్పాండేంట్లు/ప్రతివాదులు :
శ్రీమతి తుమ్మల అమ్మాజి వగైరాలు

నోటీసు

టు:
R8 : రిమ్మలపూడి సత్య శ్రీదేవి W/o వెంకటరావు, ఇంటి నెం 69-17-14, రాజేంద్రనగర్ కోలని, రమణయ్యపేట, కాకినాడ జిల్లా
R9 : వేమూరి నరసింహారావు S/o లీలా కృష్ణ, ఇంటి నెం 70-14-16/ 5 E1, ఇంద్రప్రస్థ రెసిడెన్సీ, జయేంద్ర నగర్, గోదారి గుంట, కాకినాడ జిల్లా

పై నెంబరు పిటిషను లో మీకు ఎన్ని సార్లు కోర్టు ద్వారా, రిజిస్టర్డ్ పోస్టు ద్వారా నోటీసులు పంపినను, మీరు ఉద్దేశ పూర్వకముగా అందుకోనందున శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారము ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయు నదేమనగా **తే 02-12-2025ది ఉదయం 10.30 ని.లకు** పై కోర్టు వారి ఎదుట మీరు వ్యక్తిగతముగా గాని లేక మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరు అయి మీకు గల అక్షేపనలు తెలియ పరుచుకొనవలెను. లేనిఎడల శ్రీ కోర్టు వారు పై నెంబరు పిటిషను మీ పరోక్షమున తీర్మానించడమగునని ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియ పరచడ మైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
పిటిషనరు తరపు న్యాయవాదులు
శ్రీమతి S.V.లక్ష్మి, B.హరిశంకర రావు
అడ్వకేట్లు యలమంచిలి,
యలమంచిలి
తేదీ:22-12-25
సెల్ : 9247895643

మహారాజశ్రీ యలమంచిలి ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి
(జూనియర్ డివిజన్) వారి కోర్టులో
OS 313/2023

వాదులు: తుమ్మల సూర్య ప్రసాద్ మరి 1 రు
ప్రతివాదులు : శ్రీమతి తుమ్మల అమ్మాజి వగైరాలు

దావా నోటీసు

టు
D 8 : రిమ్మలపూడి సత్య శ్రీదేవి W/o వెంకటరావు, ఇంటి నెం. 69-17-14, రాజేంద్రనగర్ కోలని, రమణయ్యపేట, కాకినాడ జిల్లా
D 9 : వేమూరి నరసింహారావు S/o లీలా కృష్ణ ఇంటి నెం 70-14-16/5 E1, ఇంద్రప్రస్థ రెసిడెన్సీ, జయేంద్ర నగర్, గోదారి గుంట, కాకినాడ జిల్లా

పై నెంబరు దావా లో మీకు ఎన్ని సార్లు కోర్టు ద్వారా, రిజిస్టర్డ్ పోస్టు ద్వారా దావా నోటీసులు పంపినను, మీరు ఉద్దేశ పూర్వకముగా అందుకోనందున శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారము ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునదేమనగా **తే.02-12-2025 ది ఉదయం 10.30 ని.లకు** పై కోర్టు వారి ఎదుట మీరు వ్యక్తిగతముగా గాని లేక మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరు అయి మీకు గల అక్షేపనలు తెలియ పరుచుకొనవలెను. లేనిఎడల శ్రీ కోర్టు వారు పై నెంబరు దావా మీ పరోక్షమున తీర్మానించడమగునని ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియ పరచడ మైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
పిటిషనరు తరపు న్యాయవాదులు
శ్రీమతి S.V.లక్ష్మి, B.హరిశంకర రావు
యలమంచిలి **అడ్వకేట్లు యలమంచిలి,**
తేదీ:22-12-25 **ఫోన్ : 9247895643**

మహారాజశ్రీ కాకినాడ 6వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో
D.O.P.No.230/2025

Between:-
కొల్లాబత్తుల దేవకుమార్ **...పిటీషనర్**
మరియు
కొల్లాబత్తుల లక్ష్మికుమారి @ కూసి లక్ష్మి కుమారి **...రెస్పొండెంట్**

టు.
కొల్లాబత్తుల లక్ష్మికుమారి@ కూసి లక్ష్మి కుమారి D/o. కూసిరాజు, డోర్‌నెం.7-7-38/1, బలుసులపేట, సామర్లకోట-533440, కాకినాడ జిల్లా,

పై నెంబరు కేసును పిటీషనరు తన భర్త అయిన మీపై విడాకులు కోరుతూ దాఖలు చేసియున్నారు. సదరు కేసులో శ్రీ కోర్టువారి ద్వారా మీకు ఎన్నిసార్లు సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున సదరు కేసులో మీరు **ది.16-12-2025** తేదీన ఉదయం **గం॥10.30ని॥లకు** పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనియెడల మీపరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(By Court Order)
కలకుర్చా రాహుల్
మడికి గౌతమ్ కుమార్
అడ్వకేట్స్, కాకినాడ
సెల్.9542327803

ఒరిజినల్ లింక్ దస్తావేజులు పోయినవి

పెన్నాడ నీరజ భర్త వీరవెంకట సత్యారావు వయస్సు 62 సం॥లు డోర్‌నెం.70-18-18/2 ఓంకారవీధి, తిలక్ రోడ్డ్ రాజమండ్రిలో నివసిస్తున్న నాయొక్క ఒరిజినల్ లింక్ దస్తావేజులు నెంబర్లు **1. 7723/2010 ది.30-12-2010SRO** రాజమండ్రి, **2. 7217/2007 ది.7-7-2007 SRO** రాజమండ్రి, **3. 6111/2001 ది.28-11-2001 SRO** రాజమండ్రి, **4. 6112/2001 ది.28-11-2007 SRO** రాజమండ్రి, **5. 3042/1997 ది.23-06-1997 SRO** రాజమండ్రి, నెంబర్లు గల దస్తావేజులు **ది.15-11-2025** తేదిన నేను తిలక్‌రోడ్ నుండి ప్రకాష్‌నగర్ జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. ఎంత వెతికినను కనిపించలేదు ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది ఫోన్ నెంబర్‌కి తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

పెన్నాడ నీరజ
సెల్.9849668799

ప్రకటన

మా క్లయింటు పూర్వం తూర్పు గోదావరి జిల్లా ప్రస్తుతం కాకినాడ జిల్లా, పిఠాపురం మండలం, నరసింగపురం గ్రామం, అగ్రహారం డోర్.నెం.2-13రు కాపురస్తులు **శ్రీ మేడిశెట్టి పేర్రాజు గారి భార్య మేడిశెట్టి లక్ష్మి గారు** మాకు ఇచ్చిన సంజాయిషిపై యావన్మందికీ తెలియజేయునది ఏమనగా.

మా క్లయింటు భర్త గారైన శ్రీ మేడిశెట్టి పేర్రాజు, S/o. మేడిశెట్టి అప్పారావు (లేటు) గారి పుర్వార్జితపు ఆస్తులైన అనగా కాకినాడ జిల్లా, పిఠాపురం మండలం, నరసింగపురం గ్రామం సర్వే నెం.64రులో 569 చదరపు గజాల స్థలంను మా క్లయింటు భర్త గారైన శ్రీ మేడిశెట్టి పేర్రాజు, మరియు ఆయన తమ్ముడు మేడిశెట్టి సత్తిబాబు 1985 సం॥రం పూర్వమే మూజువాణిగా వాటాలుగా పంచుకొనగా మా క్లయింటు భర్త గారైన శ్రీ మేడిశెట్టి పేర్రాజు గారికి 569 చదరపు గజాల స్థలంలో దక్షిణం వైపు ఉన్న 284 చదరపు గజాల స్థలం వాటాగా దాఖలు పడినది ఆనాటినుండి వారి యొక్క స్వాధీన సంపూర్ణ హక్కులో ఉంటూ మా క్లయింటు భర్త గారైన శ్రీ మేడిశెట్టి పేర్రాజు, S/o. మేడిశెట్టి అప్పారావు (లేటు) వారి జీవిత కాలంలో ది.18-02-2025వ తేదిన వీలునామా అనే మరణశాసనం వ్రాయడంమైనది. ది.22-06-2025వ తేదిన శ్రీ మేడిశెట్టి పేర్రాజు కాలం చేసినారు. వారు వ్రాసిన వీలునామా అనే మరణశాసనం రీత్యా పైన ఉదహరించిన 569 చదరపు గజాల స్థలంలో దక్షిణం వైపు ఉన్న 284 చదరపు గజాల స్థలంను మా క్లయింటు చెందచేసినారు మరియు వారి అనంతరం సదరు వీలునామాలో అంశములు ప్రకారం మా క్లయింటుకు దాఖలుపడిన నాటినుండి నేటి వరకూ మా క్లయింట్ వారి యొక్క స్వాధీన సంపూర్ణ హక్కులో ఉన్న 569 చదరపు గజాల స్థలంలో దక్షిణం వైపు ఉన్న 284 చదరపు గజాల స్థలం మరియు అందులో గల బంగళా పెంకుటింటిని పై శ్రీ మేడిశెట్టి పేర్రాజు గారి తమ్ముడు మేడిశెట్టి సత్తిబాబు భార్య శ్రీమతి మేడిశెట్టి రాజేశ్వరి గారు తప్పుడు పత్రాలను సృష్టించి వారికీ వచ్చిన వాటా ఆస్తితో పాటు మా క్లయింట్‌కు దాఖలుపడిన నాటి నుండి నేటి వరకూ మా క్లయింట్ వారి యొక్క స్వాధీన సంపూర్ణ హక్కులో ఉన్న 284 చదరపు గజాల స్థలంను కూడా అమ్ముటకు ప్రయత్నించుచున్నారు అని తెలియవచ్చింది. కావున యావన్మందికీ తెలియజేయునది ఏమనగా వీలూనావూ అనే మరణశాసనం లో అంశములు ప్రకారం మా క్లయింటుకు దాఖలుపడిన నాటినుండి నేటి వరకూ మా క్లయింట్ వారియొక్క స్వాధీన సంపూర్ణ హక్కులో ఉన్న 569 చదరపు గజాల స్థలంలో దక్షిణం వైపు ఉన్న 284 చదరపు గజాల స్థలం పై ఎవరైన మా క్లయింట్ యొక్క స్థలం అనగా బంగళా పెంకుటింటిని తీసివేసిన స్థలం పై కొనుగోలు మరియు అమ్మకాలు జరిపించిన యెడల అవి ఏమియు మా క్లయింట్ ను బైండు చేయనేరవు మరియు మా క్లయింట్ తీసుకోను సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు పూర్తి భాధ్యత వహించివలసి ఉంటుంది అని యావన్మందికీ ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయునది.

షెడ్యూలు: పూర్వం తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, పిఠాపురం సబ్-రిజిస్ట్రారులో చేరిన, నరసింగపురం పంచాయితీ, అగ్రహారం గ్రామం తాలూకు సర్వే నెం.64రు దాఖలా డోర్‌నెం.2-15రు గల బంగళా పెంకుటింటిని తీసివేయగా ప్రస్తుతం ఉన్నటువంటి 284 చదరపు గజాల లేక 237.45 చదరపు మీటర్లు ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు, కొల్తలు వివరం: **తూర్పు:** అ.47.4 అం.లు లేక 14.32 మీటర్లు ముప్పిడి సూర్యారావు గారి ఇల్లు. **పడమర:** అ.47.4 అం.లు లేక 14.32 మీటర్లు దారిమార్గం అవతల నా తాలూకు ఇల్లు, స్థలం. **ఉత్తరం:** అ.54.0 అం.లు లేక 16.45 మీటర్లు అ.33.0 అం.లు మేడిశెట్టి సత్తిబాబు గారి స్థలం. **దక్షిణం:** అ.54.0 అం.లు లేక 16.45 మీటర్లు రోడ్డు.

సదరు హద్దులు మధ్యస్థమైన 284 చదరపు గజాల స్థలము, అందలి నీటివసరులు, మార్గపు హక్కులు, వగైరా యావత్తు యాజిమెంటు హక్కులతో సర్వం సహా..

పలివెల వెంకటేశ్వరరావు, అడ్వకేట్
#1-12-5, మిలటరీ రోడ్, భానుగుడి జంక్షన్ దగ్గర, కాకినాడ. సెల్: 98488 48152